# చిన్న కథ

"నాకు విడాకులు కావాలి" అందా భార్య భర్తతో.
ఆ భర్త హడలి పోయాడు. హైరానగా భార్య వంక చూస్తూ అస్తవ్యస్తంగా కదిలాడు.
వారికి పెళ్లయ్యి 365 రోజులు కూడా కాలేదు.
అందుకైతే ఇంకా మూడు రోజులు గడవాలి.
"మాట్లాడరేం?" మళ్లీ మాట్లాడింది భార్య.

"ఏం....జ....రి...గిం...ది" అక్షరం అక్షరం కూడతీస్తూ అడిగాడు భర్త.

"మీతో నేను సమాధాన పడలేక పోతున్నాను." సన్రున చెప్పింది భార్య.

అర్థం కాలేదు భర్తకు. అదే చెప్పి, "ఏం లోటు చేస్తున్నాను" అనడిగేశాడు.

"ఘోరమైన లోటు. పూడ్చలేనంతగా విస్తరిస్తోందది." చెప్పింది భార్య.

విస్తుపోయాడు భర్త. "నీకు శారీస్, డ్రసెస్ కొనిపెడుతున్నానుగా" అన్నాడు.

"కావచ్చు..."

"నీకు జ్యుయలరీలు క్యాంపులకెళ్లే చోట్ల నుంచి కొని తెస్తున్నానుగా..."

"అవును"

"క్వార్టర్స్‌లో వసతులు బాగోలేదని చెప్పి, నీకోసం ఈ అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకున్నానుగా."

"అవ్వొచ్చు..."

# దిద్దుకో....

– బత్తుల వెంకట దుర్గా ప్రసాదరావు




"మోటార్ బైక్ సౌఖ్యంగా ఉండడం లేదని తలచి, మన మ్యారేజీ డే గిఫ్టుగా కారు....కారు కొంటున్నానుగా.."

"ఆఁ.."

భార్య పొడి జవాబులకు భర్త మరింత తికమకపడుతున్నాడు. దాంతో విసుగుగా అన్నాడు. "ఇవన్నీ...ఇలాంటివి ఎన్నెన్నో నీకై నేను చేస్తున్నాను. అదీ నీ ప్రేరణ, ప్రమేయం లేకుండానే... నిన్ను అడగకనే...."

"అదీ...అదీ....అదే నాకు నచ్చడం లేదు." టక్కున చెప్పేసింది భార్య.

"ఏదీ..."

"అదే....నా ప్రమేయం లేకుండానే...నాకు ఏం కావాలో తెలుసుకోకుండానే...మీరే...మీ మట్టుగా మీరే....నాకు అన్నీ సమకూర్చి పెట్టేస్తున్నాను అనుకోవడం...." చెప్పింది భార్య విసురుగా.

"ఇదేనా...ఇంతేనా...దీనికే విడాకులా?"

"ముమ్మాటికీనీ...నా ప్రతిపాదన సరైనదే. నాకూ వ్యక్తిత్వం ఉటుంది. నా అవసరాలు నాకూ ఉంటాయి...పైగా సంసారం అంటే మీరు....నేను...మనము. అది గుర్తించండి" చెప్పింది భార్య తీక్షణంగానే.

భర్త అదిరాడు. నిజంగానే బెదిరాడు.

అప్పుడే వీధిలో ఎలక్షన్ మైకుల హోరు తమ నివాసం మీదుగా సాగుతూండడంతో వారి మధ్య సంభాషణ ఆగింది.

ఆ హోరు క్రమేపీ తగ్గుతూండగా–

"అవును...నిజమే...ఓటరు ప్రమేయం లేకుండానే అవీ ఇవీ అంద జేస్తామని ప్రకటన గుప్పించే పోటీదార్ల తీరులాగానే ఉందిగా నా తీరున్నూ...ఛఛ..."గొణుక్కుంటున్నట్లు అనుకోగలిగాడు భర్త.

భర్త సణుగుడు గ్రహించిన భార్య స్థిమితపడి, భర్త వంక చూస్తోంది మెచ్చుకోలుగా.

*


చిరునామా
బత్తుల వెంకట దుర్గా ప్రసాదరావు
14-7-21 హెడ్ పోస్టాఫీస్ స్ట్రీట్
(బెల్గాం)
పార్వతీపురం-535501
విజయనగరం జిల్లా
సెల్: 9701568568